మహిళలే మహారాణులు

- వివిధ రంగాల్లో రాణిస్తున్న స్త్రీమూర్తులు
- లక్ష్యసాధన దిశగా అడుగులు
- ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న అతివలు

కరప: దృఢ సంకల్పం, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మహిళలు నిరూపిస్తున్నారు. మహిళలు మగవారికి ధీటుగా ప్రతి రంగంలో పోటీ పడుతూ, రాణిస్తూ గుర్తింపు పొందుతున్నారు. మహిళాభ్యున్నతికి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమివ్వడంతో వస్తున్న అవకాశాలన్నింటినీ అందిపుచ్చుకుంటూ, వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. రాజకీయంగా, ఉద్యోగపరంగా, సేవా కార్యక్రమాల ద్వారా ఇలా వివిధ రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరప మండలంలో రాణిస్తున్న పలువురు మహిళల వివరాలివి.


కాకినాడ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న కరప ఎస్సై సునీత(ఫైల్)

వృత్తి హెచ్‌ఎం.. ప్రవృత్తి సమాజ సేవ


ఎండీ షర్మిల, అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్

కాకినాడకు చెందిన ఎండీ షర్మిల ఎంఏ బీఈడీ అర్హతతో 16 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రవృత్తిగా సమాజ సేవను ఎంచుకున్న ఆమె ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే, ముస్లిం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో రిసోర్స్‌పర్సన్‌గా, లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్‌కు ప్రెసిడెంట్‌గా వందలాది పేద, మధ్య తరగతి విద్యార్థులకు అండగా నిలిచారు. వారి అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. మెల్విన్ జోన్స్ ఫెలోషిప్ అవార్డునూ అందుకున్నారు. ఆమె వద్ద చదివిన విద్యార్థులు ఐఐటీ, మెడికల్ విభాగాల్లో దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజాభివృద్ధి జరిగినట్టు అని, మహిళలు గృహానికే పరిమితం కాకుండా, అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


మట్టపర్తి అనుపమ, ఎంపీడీఓ, కరప మండలం

ఏరంగంలో అయినా మహిళలు ఎవరికీతీసిపోరు. ఓ లక్ష్యాన్ని ఏర్పచుకుని, నిరంతరం శ్రమిస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని ఎంపీడీఓ మట్టపర్తి అనుపమ నిరూపించారు. ఉన్నత చదువు చదివి, భవిష్యత్తును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలన్న తపనను తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంఏ బీఈడీ, బీఎస్సీ(కంప్యూటర్స్) చదివారు. జ్యుడీషియల్‌లో జూనియర్ అసిస్టెంట్ జాబ్ సంపాదించారు. అక్కడితో ఆగకుండా గ్రూపు–1 పరీక్షలు రాసి, 2016లో ఎంపీడీఓ పోస్టు సాధించి, ఏలేశ్వరం మండల అభివృద్ధి అధికారిగా ఉద్యోగంలో చేరారు. గతేడాది కరప మండలానికి బదిలీపై వచ్చారు. ఎక్కడ పనిచేసినా కార్యాలయానికి వచ్చిన వారితో చిరునవ్వుతో పలకరించి, వారి సమస్య అడిగితెలుసుకుని, పరిష్కరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు కరప ఎంపీడీఓ అనుపమ. భర్త ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారంతో ప్రశాంతంగా విధులు నిర్వర్తించగలుగుతున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. ఆడపిల్లలపై వివక్ష చూపకుండా, తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ సమానంగా ఆదరించి, చదివించాలని, చదువుతోనే ఉపాధి కల్పించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని ఎంపీడీఓ అనుపమ అన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించడానికి..


తోట సునీత, ఎస్సై, కరప పోలీస్‌స్టేషన్

పోలీసులంటే ప్రజలకు అన్నివేళల అండగా ఉంటూ రక్షణ కల్పిస్తారని భరోసానిచ్చి, అందరికీ ఆదర్శంగా నిలిచారు కరప ఎస్సై తోట సునీత. ఎప్పుడు, ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందించి, మహిళలకు భద్రత కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు ఆమె. అవకాశం వస్తే మహిళలు కూడా పోలీసు శాఖలో రాణిస్తారని నిరూపించారు. ఎంత కష్టమైనా చదువుకుని, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న కలను తల్లిదండ్రుల ప్రోద్బలంతో ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) చదివి, ఎస్సై ఉద్యోగంతో కల సాకారం చేసుకున్నారు. 2018లో ఎస్సైగా ఉద్యోగం సాధించి, అన్నవరం పోలీస్ స్టేషన్‌లో చేరారు. తర్వాత మండపేట, జగ్గంపేట, సామర్లకోట, కాకినాడ–2 టౌన్ స్టేషన్లలో పనిచేసి, గతేడాది కరపకు బదిలీపై వచ్చారు. ఎక్కడ పనిచేసినా నిబద్ధతతో పనిచేస్తూ, అధికారులు, నాయకులతో పాటు, ప్రజల మన్ననలు పొందారు. అంకితభావంతో పనిచేస్తూ, చేస్తున్న సేవలకు గుర్తించి ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాల్లో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు ఎస్సై సునీత. మహిళలమనే ఆత్మన్యూనతాభావాన్ని విడిచి, ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, నిరంతరం శ్రమిస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని ఎస్సై సునీత పేర్కొన్నారు.

ఆర్థికంగా నిలదొక్కుకోవాలి


పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ, కరప మండలం

సమాజంలో ఎదురయ్యే ఒడిదుడుకులు తట్టుకోవాలంటే మహిళలు తప్పనిసరిగా చదువుకుని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటున్నారు కరప మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు పెంకే శ్రీలక్ష్మి. తల్లిదండ్రులు పిల్లలపై వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూడాలని, ప్రధానంగా మహిళలకు అవకాశమిస్తే అన్నింట్లో రాణిస్తారన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. 2022లో ఎంపీపీ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో శ్రీలక్ష్మి కరప–1 ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. అప్పటి మంత్రి కురసాల కన్నబాబు సూచనలతో ఆమెను ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భర్త, మాజీ ఎంపీటీసీ పెంకే సత్తిబాబు ప్రోత్సాహంతో మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ, అధికారులతో కలిసి ప్రజాసంక్షేమంతో పాటు, మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిపరచి ముందుకు సాగుతున్నారు.

పేదలకు సేవ చేసేందుకే..


డాక్టర్ వి.ఏంజిలిన్, మండల వైద్యాధికారి, కరప

సమాజంలో పేదలకు సేవ చేయాలన్న సంకల్పం, దానికితోడు సైన్స్ అంటే ఇష్టంతో మెడిసిన్ చదివి వైద్య వృత్తిని చేపట్టి రాణిస్తున్నారు కరప మండల వైద్యాధికారి డాక్టర్ వి.ఏంజిలిన్. ఆమె మాటల్లోనే.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యనభ్యసించాల్సిన ఆవశ్యకత ఉంది. తల్లిదండ్రులు, భర్త డాక్టర్ జాన్ విల్సన్ ఇస్తున్న ప్రోత్సాహంతోనే వైద్య వృత్తి చేపట్టి ప్రజలకు సేవచేయగలుగుతున్నాను. ఆడపిల్లలను వంటింటికే పరిమితం చేయకుండా, వారిని చదివించి, ఎవరిపైనా ఆధారపడకుండా ఉపాధి కల్పించాలి. నేటి సమాజంలో మహిళలు తన కుటుంబం కోసం ఆలోచిస్తూ, అహర్నిశలు కష్టపడి పనిచేస్తూ, తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. చాలా మంది మహిళల్లో ఐరన్, కాల్షియం, విటమిన్–డి వంటి లోపాలతో అనారోగ్యం పాలవుతున్నారు. మహిళలు కుటుంబంతో పాటు, తన ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకుని, పోషకాహారం, న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలి. మహిళలు స్వశక్తితో నిలబడాలంటే తప్పనిసరిగా చదువుకుని ముందుకు సాగాలి. కుటుంబ సభ్యులందరూ తగిన ప్రోత్సాహం అందిస్తే మహిళలు కూడా మగవారికి ధీటుగా రాణిస్తారు.

సారా నిర్మూలనకు నవోదయం 2.0 ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: నాటు సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సారా తయారీ, విక్రయాలను మానుకోవాలని, ఇక కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. నవోదయం 2.0 ద్వారా అర్హులైన వారికి ఉపాధి చర్యలు చేపడతారన్నారు. సారాపై 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. జిల్లాలో గుర్తించిన 137 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ సారా తయారు చేసే కుటుంబాలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. నల్లబెల్లం వ్యాపారులను నియంత్రించాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, జెడ్పీ సీఈవో, డీపీఓ, జిల్లా అటవీ అధికారి, డీపీఆర్‌ఓతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పేద విద్యార్థులకు అండగా ఎఫ్‌ఎఫ్‌ఈ

బాలాజీచెరువు: పేద విద్యార్థులకు ఫౌండేషన్ ఫర్ ఎక్సలెన్స్(ఎఫ్‌ఎఫ్‌ఈ) స్కాలర్‌షిప్ ప్రోగ్రాం అండగా నిలుస్తుందని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు ఉడతా సత్యనారాయణ శుక్రవారం ఇక్కడ తెలిపారు. ప్రముఖ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్, మెడిసిన్ ఫస్టియర్ చదువుతున్న 54 మందికి రూ.27 లక్షల ఉపకార వేతనాలు మంజూరు చేశారని చెప్పారు. అలహాబాద్‌కు చెందిన ఎన్నారై ప్రభుగోయెల ఈ సంస్థ ద్వారా సహకారం అందిస్తున్నారన్నారు. అకడమిక్ మార్కులు, మానసిక సమర్థత, ఇతర ప్రోగ్రెస్ రిపోర్టుల ఆధారంగా సహకరిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు 94406 15203 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు గైర్హాజరు

కరప: వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరంలో 113 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 110 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు తెలిపారు. మ్యాథ్స్–2ఏ, బోటనీ–2, సివిక్స్–2 సబ్జెక్టుల్లో పరీక్ష జరిగిందన్నారు.

రామాలయం జీర్ణోద్ధరణకు పూజలు

కాకినాడ రూరల్: సర్పవరంలో సుమారు 160 ఏళ్ల చరిత్ర కలిగిన రామాలయం జీర్ణోద్ధరణకు రెండో రోజు శుక్రవారం పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పురాణం రామకృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో శనివారం చిన్నజీయర్ స్వామి చేతులమీదుగా హనుమ లక్ష్మణ సహిత సీతారామచంద్ర స్వామి వార్ల విగ్రహాలకు మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. రెండో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రాతఃఆరాధన, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, గోపూజ, వేదాది విన్నపాలు, సుందరకాండ, పారాయణ, దివ్య ప్రబంధ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, ఛాయాస్నపవం, సుదర్శన ఇష్టి, నివేదన, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

కరప: ఆయుర్వేదమనేది ప్రాచీన వైద్య విధానమని, ఉచితంగా అందిస్తున్న మందులను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఆయుర్వేద వైద్యశాల(గురజనాపల్లి) ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ బి.దివ్య విద్యార్థులను పరీక్షించి, మందులను అందజేశారు.

యువకుడి బలవన్మరణం

కాకినాడ క్రైం: నగరంలోని బ్యాంక్ పేటకు చెందిన వి.అనిల్‌కుమార్(22) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆనంద్ థియేటర్ సమీపంలో ఓ ఛార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయంలో అతడు పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రలేచి చూసేసరికి హాల్‌లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని అనిల్ విగతజీవిగా కనిపించాడు. బలవన్మరణానికి కారణాలు తెలియరాలేదు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

కానిస్టేబుల్‌కు గాయాలు

కాకినాడ క్రైం: ఎస్పీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ఓ కానిస్టేబుల్‌ను ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ తారేపల్లి రాంప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వాహనదారుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం


ఉద్యోగినులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు


మహిళా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్, కమిషనర్ భావన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

- జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: అన్ని రంగాల్లో సమానత్వం సాధించడం ద్వారా సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం వివిధ విభాగాల ఉద్యోగినులను సత్కరించారు. మహిళా హక్కులపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. జెడ్పీ సీఈవో వీవీఎస్ఎస్ లక్ష్మణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన 200కు పైగా ఉద్యోగులు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కలెక్టర్ షణ్మోహన్, మున్సిపల్ కమిషనర్ భావన, డీఆర్‌ఓ జి.వెంకటరావు, ఏపీ జేఏసీ కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ చల్లా సంధ్యారాణి, జనరల్ సెక్రటరీ శిరీష పాల్గొన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఉద్యోగినులకు ఏ సమస్య ఉన్నా వాట్సాప్ ద్వారా నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు.

బార్ అసోసియేషన్‌లో

కాకినాడ లీగల్: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉండాలన్నారు. ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి, బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు చక్క శ్రీనివాస్, వీరభద్రరావు, పాశం శంకర్‌శ్రీనివాస్, మహిళా ప్రతినిధి జీఎస్ సునీత తదితరులు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్ అన్నారు. స్థానిక పైడా శ్రీనివాస కల్యాణ మండపంలో మహిళామోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించారు. మహిళలకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

మహిళాభ్యుదయంతోనే సమాజాభివృద్ధి

కరప: మహిళలను ప్రోత్సహించి, గౌరవించడం ద్వారానే మహిళాభ్యుదయం సాధ్యమవుతుందని, తద్వారా సమాజాభివృద్ధి సాధించవచ్చని హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ అన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, ఎందరో మహోన్నతులు మహిళా సాధికారత కోసం శ్రమించారన్నారు. అనంతరం టీచర్లు ఎం.ప్రభావాణి, ఎం.మణిమాణిక్యాంబ, కె.లక్ష్మి, సీహెచ్ పద్మావతి, పి.చంద్రావతి, వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

అదేవిధంగా నడకుదురు మండల ప్రాథమిక పాఠశాలలో శానిటరీ వర్కర్ మూడే రాజమ్మను, ఎండీఎం వర్కర్లు రాఘవమ్మ, జానకమ్మను హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ సత్కరించారు. అనంతరం యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.వెంకటరమణ, సభ్యులు డీవీవీ బాపిరాజు, నరాల కృష్ణకుమార్, లీలా రమాదేవి, ఇందిర, రామకృష్ణ తదితరులు నడకుదురులోని జనావళి వృద్ధుల అనాథాశ్రమంలోని మహిళలకు పండ్లు, రొట్టెలు అందజేశారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కాకినాడ సిటీ: శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి అధ్యక్షత వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, శ్రామిక మహిళలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు పరిహారాలను తక్షణం విడుదల చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌ఓ నరసింహ నాయక్ పాల్గొన్నారు. తొలుత బాలాజీ చెరువు సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు.

నిర్మాణ పనుల పరిశీలన

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో నిర్మాణంలో ఉన్న మాతా, శిశు విభాగాన్ని కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మ్యాప్‌ను పరిశీలించి, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఇతర అధికారులు ఉన్నారు.

జనరిక్ మందులు మంచివే..

జనరిక్ మందులు మంచివేనని వీటిని వాడుకోవడం వల్ల ఎటువంటి అనర్థాలు ఉండవని ఎంపి ఉదయ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జీజీహెచ్‌లో జరిగిన జన ఔషధి దినోత్సవానికి ఎంపి అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ
- పీజీ సెంటరులో ఘనంగా మహిళా దినోత్సవం


నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్‌లో వేడుకలు ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ


మహిళా దినోత్సవంలో విద్యార్థుల నృత్యాలు


వాకలపూడిలో దివ్యాంగులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న ప్రసన్నశ్రీ

కాకినాడ రూరల్: ఏ విద్యా సంస్థ విజయానికైనా సమయ పాలన కీలకమని, విద్యార్థుల హాజరు, తరగతుల క్రమశిక్షణపై అధ్యాపకులు బాధ్యతయుతమైన పాత్ర పోషించడంతో పాటు, పరిశోధనలపై దృష్టి పెట్టాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కాకినాడ రూరల్ తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటరును శుక్రవారం ఆమె తొలిసారిగా సందర్శించారు. పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత ఆమెకు ప్రశాంతిశ్రీ, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ప్రాంగణంలోని పీజీ సెంటరు స్థల దాత సత్యలింగ నాయకర్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. క్యాంపస్ అభివృద్ధి, మహిళల హాస్టల్, అంతర్గత రహదారులు విస్తరణ తదితర వాటిపై ఆరా తీశారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. మహిళా అధ్యాపకులు, విద్యార్థులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, అభినందించారు. వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ ఆధ్వర్యంలో వీసీ ప్రసన్నశ్రీని ఘనంగా సత్కరించారు. వేడుకల్లో భాగంగా భారతీయ సంప్రదాయ నృత్యాలు, థింసా నృత్యాలతో పాటు, హస్తకళల ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

పోస్టర్ ఆవిష్కరణ

డీసీఎంఎస్ తలాష్ ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ప్రసన్నశ్రీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఉదయ్‌కుమార్, పంశు సంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వర్లు, ఓఎన్జీసీ హెచ్‌ఆర్ మేనేజర్ సునీల్‌కుమార్, పీజీ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, రాధామాధవి, వెంకటేశ్వర్లు, కొల్లా కృష్ణమూర్తి, మనోజ్ దేవా తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

వాకలపూడి ఉమా మనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలను వీసీ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ పంపిణీ చేశారు. ఉమా మనో వికాస కేంద్రం సందర్శించిన ఆమెకు కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి స్వాగతం పలికారు. ఈ కేంద్రం ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలను ఆమె తెలుసుకుని, నిర్వాహకులను అభినందించారు. సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు.